పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది

పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్

సత్తుపల్లి టౌన్, మే 12: సత్తుపల్లి నియోజకవర్గంలోని ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉందని, సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించామని కల్లూరు ఏసీపీ అనిశెట్టి రఘు చెప్పారు. సోమవారం సత్తుపల్లి సబ్ డివిజన్ పరిధిలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి భద్రతా విషయాలపై ఏసీపీ రఘు 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడారు. సత్తుపల్లి డివిజన్‌లో 1540 మంది పోలీసులు విధుల్లో ఉన్నారని చెప్పారు. ఇద్దరు ఏసీపీలు, ఐదుగురు సీఐలు, 24 మంది ఎస్సైలు, 439 మంది కానిస్టేబుళ్లు, 65 మంది హోంగార్డులు, నలుగురు మహిళా పోలీసులు, 1000 మంది కేంద్ర బలగాలు ఎన్నికల విధులు నిర్వహించనున్నట్లు వివరించారు. నియోజకవర్గవ్యాప్తంగా 16 సమస్యాత్మక గ్రామాలు గుర్తించామని, వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సందర్భంగా డివిజన్ పరిధిలో వైన్‌షాపులతో పాటు బెల్టుషాపులను మూయించామని, ఎక్కడైనా మద్యం అమ్మకాలు జరిగితే నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని ఏసీపీ హెచ్చరించారు.

నిఘా నీడలో పోలింగ్

సత్తుపల్లి/సత్తుపల్లి టౌన్, మే 12: సోమవారం జరగనున్న పార్లమెంట్ ఎన్నిక ప్రశాంతంగా జరిగేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఆర్డీవో రాజేందర్ అన్నారు. ఆదివారం ఆయన సత్తుపల్లిలో మాట్లాడారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసుశాఖ ఆధ్వర్యంలో 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. దివ్యాంగుల కోసం కిష్టారం జడ్పీ హైస్కూల్‌లో పోలింగ్ కేంద్రం సిద్ధం చేశామన్నారు. సత్తుపల్లి నియోజకవర్గంలోని తల్లాడ, కల్లూరు, పెనుబల్లి, వేంసూరు, సత్తుపల్లి మండలాల పరిధిలో 294 పోలింగ్ కేంద్రాల్లో 2,43,460 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నట్లు తెలిపారు. 144 సెక్షన్ అమలు కారణంగా ఐదుగురికి మించి గుమికూడవద్దని తెలిపారు.

ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

కొణిజర్ల, మే 12: సోమవారం జరగనున్న లోక్ సభ ఎన్నికలకు అధికారులు ఏర్పాట్లు చేశారు. మండలంలో 27 పంచాయతీల్లో 60 పోలింగ్‌బూత్‌ల ద్వారా ఓటర్లు ఓటు వినియోగించుకోనున్నారు. మండల వ్యాప్తంగా 48,278 మంది ఓటర్లు ఉండగా అందులో పురుషులు 23,616, మహిళలు 24,661 మంది, ఇతరులు ఒకరున్నారు. ఆదివారం సాయంత్రం గాలి దుమారంతో కూడిన వర్షం కురవడంతో కొణిజర్ల, పలు కేంద్రాల్లో టెంట్లు నేలకూలాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో చీకట్లలోనే విధులు నిర్వర్తించారు.

పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది

ఎర్రుపాలెం, మే 12: మండలంలో 54 పోలింగ్ కేంద్రాల్లో 5 సెక్టార్ల పరిధిలో 216 మంది పోలింగ్ సిబ్బంది విధులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఉషాశారద తెలిపారు. మొత్తం 3,99,78 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

ఎన్నికల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

మధిర, మే 12: పోలింగ్ అధికారులతో పాటు, సిబ్బంది పోలింగ్ సమయంలో అప్రమత్తంగా ఉండాలని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ఖమ్మం ఆర్డీవో జీ.గణేష్ సూచించారు. మధిర సమీపంలోని ఖాజీపురంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఎన్నికల సిబ్బందికి ప్రత్యేక సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం పోలింగ్‌స్టేషన్ల వారిగా ఈవీఎం ప్యాడ్లతో పాటు, మిషన్లను, సంబంధిత సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్లు వెంకటేశ్వర్లు, సుమన్ సెంటర్ రమేష్‌తో పాటు, ఎలక్షన్ అధికారులు పాల్గొన్నారు.

పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి

కూసుమంచి, మే 12: కూసుమంచి, నేలకొండపల్లి మండలాల్లో ఎన్నికలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కూసుమంచి మండలంలోని పాలేరులో ఆదర్శ మహిళా పోలింగ్ కేంద్రాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. ఎక్కడా ఎలాంటి ఘటనలు జరగకుండా రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో సీఐలు రాజిరెడ్డి, జనార్ధన్, ఎస్సైలు పూర్తి బందోబస్తు నిర్వహిస్తున్నారు. పొన్నెకల్లు శ్రీచైతన్య కళాశాల నుంచి ఎన్నికల సామగ్రిని పోలింగ్ సిబ్బందికి అందజేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద పంచాయతీ కార్యదర్శులు, బీఎల్‌వోలు ఎంపీడీవోలు పర్యవేక్షణ చేస్తున్నారు.

స్థానిక పోలీసులు, స్పెసల్ పార్టీ పోలీసులతో కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామని రూరల్ ఏసీపీ టీ.తిరుపతిరెడ్డి తెలిపారు. సమస్యాత్మక గ్రామాల్లో పోలీసులను మోహరించామని, ఎక్కడా ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు.

బోనకల్లు, మే 12: మండలంలోని 22 గ్రామాల్లో పోలింగ్‌స్టేషన్లు ఏర్పాటు చేశారు. ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చలువ పందిళ్లు, టెంట్లు, వైద్యసిబ్బంది, తాగునీరుతో పాటు, ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. మండలంలోని జానకీపురంలో ప్రత్యేకంగా వికలాంగుల ఆదర్శ పోలింగ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. గ్రామాల్లో 144 సెక్షన్ విధించారు.

సత్తుపల్లి టౌన్: ఎన్నికల ఏర్పాట్లలో సత్తుపల్లి ఏసీపీ రఘు, అధికారులు

బోనకల్ : పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు

మధిర : ఈవీఎంల అనుసంధానాన్ని పరిశీలిస్తున్న అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి



కూసుమంచి : పాలేరులోని మోడల్ పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లు

స్ట్రాంగ్‌రూం నుంచి ఈవీఎంలు తరలిస్తున్న సిబ్బంది

ఎర్రుపాలెం : పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పరిశీలిస్తున్న తహసీల్దార్ ఉషాశారద

ఎంపీ వద్దిరాజుకు సత్కారం

వద్దిరాజు రవిచంద్రను సత్కరిస్తున్న యువకులు

ఖమ్మం, మే 12 : రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రను పవర్ వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం ఘనంగా సత్కరించారు. ఖమ్మం బుర హాన్‌పురంలోని క్యాంప్ కార్యాలయంలో ఎంపీ రవిచంద్రను అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, ఖమ్మం జిల్లా కార్యదర్శి మనోజ్‌కుమార్, సభ్యులు రాపర్తి రాజా, బోయిన కార్తీక్, బాలు నాయుడు, నగీనా తదితరులు కలిసి శాలువాలతో సన్మానించారు. వద్దిరాజును కలిసిన వారిలో ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియం ఎదురుగా ఉన్న క్లాసిక్ జిమ్ పక్షాన మిస్టర్ ఇండియా తెలంగాణ పోటీల్లో వెండి పతక విజేత బాలునాయుడు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పవర్ వెయిట్‌లిఫ్టింగ్ పోటీలో ది బెస్ట్ లిఫ్టర్‌గా ప్రశంసలందుకున్న బోయిన కార్తీక్, నగీనా స్ట్రాంగ్ ఉమెన్ టైటిల్ గెల్చుకున్నారు. రాపర్తి రాజా ఆధ్వర్యంలో జూన్ 2వ తేదీన ఖమ్మంలోని టీఎన్జీవో భవన్ ప్రాంగణంలో జరిగే పవర్ వెయిట్ లిఫ్టింగ్, బెంచ్‌ప్రెస్ పోటీలకు ముఖ్యఅతిథిగా హాజరు కావలసిందిగా ఎంపీ వద్దిరాజును వారు కోరారు.

నిత్యం అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

వైరాలో ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఖమ్మం కలెక్టర్ గౌతమ్

వైరా టౌన్, మే 12: ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని అసెంబ్లీ సిగ్మెంట్లలో విధులు నిర్వహిస్తున్న ఎన్నికల అధికారులు, సిబ్బంది ఎన్నికల విధుల పట్ల నిత్యం అప్రమత్తంగా ఉండాలని రిటర్నింగ్ అధికారి, ఖమ్మం కలెక్టర్ గౌతమ్ సూచించారు. వైరా అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలోని టీఎస్ సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో ఏర్పాటుచేసిన పార్లమెంట్ ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. అనంతరం పోలింగ్ కేంద్రాలకు వెళ్లే ఎన్నికల అధికారులకు అదనపు కలెక్టర్ సత్యప్రసాద్‌తో కలిసి ఎన్నికల సామాగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైరా అసెంబ్లీ నియోజకవర్గంలోని వైరా, కొణిజర్ల, ఏన్కూరు, సింగరేణి, జూలూరుపాడు మండలాల్లోని 252 పోలింగ్ కేంద్రాలకు సిబ్బందిని నియమించి వారికి సామగ్రిని పంపిణీ చేసి ప్రత్యేక బస్సుల్లో పంపుతున్నట్లు చెప్పారు. ఖమ్మం జిల్లాలో సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. ఎన్నికల సిబ్బంది పోలింగ్ శాతం ఎప్పటికప్పుడు జిల్లా ఉన్నతాధికారులకు తెలియజేయాలని సూచించారు. సీపీ సునీల్‌దత్ తదితరులు పాల్గొన్నారు.

రూ.3.46 లక్షలు పట్టివేత

కారేపల్లి, మే12: మండలంలోని ముత్యాలగూడెం సమీపంలో ఆదివారం ఫ్లైయింగ్ స్క్వాడ్ వాహనాలు తనిఖీలు చేస్తుండగా బీజేపీకి చెందిన ఇద్దరు వ్యక్తులు కారులో రూ.3,46,500 తీసుకెళ్తుండగా పట్టుకున్నామని ఎస్సై రాజారాం తెలిపారు. వాహనంతో పాటు నగదును స్వాధీనం చేసుకొని ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు చెప్పారు.

కోట మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



దేవాలయ సిబ్బందికి ఏసీని అందజేస్తున్న దాతలు

కారేపల్లి, మే 12: మండలంలోని ఉసిరికాయలపల్లి కోట మైసమ్మ ఆలయంలో ఆలయ పూజారి కొత్తలంక కైలాసశర్మ ఆధ్వర్యంలో భక్తులకు గోత్రనామ పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఖమ్మం నగరానికి చెందిన సామినేని గంగాధర్, కృష్ణవేణి దంపతులు గర్భగుడిలో ఏర్పాటు చేసేందుకు ఏసీని అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది భీమవరపు సూర్యప్రకాశ్‌రావు, మూడు మోహన్, దాతల కుటుంబ సభ్యులు సామినేని వెంకటేశ్వర్లు, వాణిశ్రీ, భీమవరపు శ్రీనివాసరావు, గాలి రంగారావు, రమాదేవి, వసంతకుమారి పాల్గొన్నారు.

సాగర్ జలాలు విడుదల చేయాలి

మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ బొంతు సమత

వైరాటౌన్, మే 12: మంచినీటి అవసరాల కోసం వైరా రిజర్వాయర్ లోకి హాఫ్ టీఎంసీ సాగర్ జలాలు విడుదల చేయాలని మాజీ ఎంపీపీ, సీపీఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు బొంతు సమత డిమాండ్ చేశారు. ఆదివారం బోడేపూడి వెంకటేశ్వరరావు భవన్‌లో రుద్రాక్షల నర్సింహాచారి అధ్యక్షతన సమావేశంలో ఆమె మాట్లాడారు. రోజురోజుకు వైరా రిజర్వాయర్ నీటిమట్టం అడుగంటుతున్న సమయంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని సాగర్ జలాలు విడుదల చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు మందడపు రామారావు, కురుగుంట్ల శ్రీనివాసరావు, షేక్ జమాల్, వడ్లమూడి మధు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం

కుట్టుమిషన్ అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభులు

వైరాటౌన్, మే 12: లయన్స్ క్లబ్ వైరా ఆధ్వర్యంలో మహిళలకు ఆర్థికసాయం అందజేశారు. మీల్స్ అండ్ వీల్స్ కోఆర్డినేటర్ చింతోజు నాగేశ్వరరావు, సీత పెళ్లిరోజు పురస్కరించుకొని నర్సింగ్ కోర్సు చేస్తున్న ఖమ్మంకు చెందిన కావ్యకు రూ.10వేలు, క్లబ్ సహాయ కార్యదర్శి కొల్లా రాంబాబు నాగమణి పెళ్లిరోజున పురస్కరించుకొని పెనుబల్లి మండలం తాళ్లపెంటకు చెందిన నడిపల్లి శ్రీదేవికి ఉపాధి నిమిత్తం కుట్టుమిషన్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ, లయన్స్‌క్లబ్ వైరా అధ్యక్షుడు పెనుగొండ ఉపేందర్‌రావు, రీజనల్ చైర్మన్ లగడపాటి ప్రభాకర్, కార్యదర్శి అబ్బూరి రమేశ్, కోశాధికారి చింతలపూడి వెంకటేశ్వరరావు, క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మాతృదినోత్సవ వేడుకలు

తమ పిల్లలతో కలిసి కేక్ కట్ చేస్తున్న తల్లి

పెనుబల్లి, మే 12: మాతృదినోత్సవ వేడుకలకు ఆదివారం మండలంలో ఘనంగా నిర్వహించారు. పిల్లలు తమ తల్లులకు మాతృదినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. పలు చోట్ల కేక్‌లు కట్ చేసి ఆనందంగా గడిపారు.

సింగరేణి బొగ్గు తరలింపు అడ్డుకుంటాం

సమావేశంలో మాట్లాడుతున్న లారీ యజమానులు

సత్తుపల్లి టౌన్, మే 13: సత్తుపల్లి కేంద్రంగా కొత్తగూడెం రుద్రంపూర్ కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్‌కు తరలించే బొగ్గును అడ్డుకుంటామని సత్తుపల్లి లారీ యజమానుల సంఘం హెచ్చరించింది. ఆదివారం ఉదయం సత్తుపల్లిలోని లారీ యజమానుల సంఘం భవనం వద్ద విలేకరులతో మాట్లాడారు. 14వ తేదీ నుంచి కొత్తగూడెంలోని రుద్రంపూర్ కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్‌కు తరలించేందుకు సింగరేణి సంస్థ టెండర్లు పిలిచిందని, 14వ తేదీ నుంచి ఈ రవాణా ప్రారంభం కానుందని, ఈ రవాణాను తాము అడ్డుకుంటామని హెచ్చరించారు. సత్తుపల్లిలో సింగరేణి సంస్థను ఆధారం చేసుకుని 745 లారీలు ఉన్నాయని, ఈ లారీలకు కాకుండా కాంట్రాక్టర్ ద్వారా బొగ్గును సరఫరా చేసేందుకు సింగరేణి సంస్థ కుట్రపన్నిందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా చేస్తున్న ఈ చర్యను తాము అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో లారీ యజమానుల సంఘం అధ్యక్షుడు కొండపల్లి రమేశ్‌రెడ్డి, కార్యదర్శి కిజర్, మాజీ లారీ యాజమానుల సంఘం అధ్యక్షుడు పీఎల్.ప్రసాద్, మౌలాలి పాల్గొన్నారు.

మధిరలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవం

నర్సులను సన్మానిస్తున్న అసోసియేషన్ బాధ్యులు

మధిర, మే 12: మధిర ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని స్విమ్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నర్సులను శాలువాలు కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఆరోగ్య సంరక్షణ సేవలు అందించడంలో నర్సులు బాధ్యతగా వ్యవహరిస్తారని కొనియాడారు. కార్యక్రమంలో పోతుల ప్రసాదరావు, జింకల కోటేశ్వరరావు, రంగిశెట్టి శ్రీనివాసరావు, ఆదూరి అబ్రహాం, ఊటుకూరు భాస్కర్‌రావు, మైనేడి పూర్ణచందర్‌రావు, గండూరి రాంబాబు, భూక్యా హనుమా, యలమద్ది రాము, బజాజ్ సాంబిరెడ్డి, శీలం శ్రీనివాసరెడ్డి, సుకూర్, మేకల ఉపేంద్ర, చిదిరాల సత్యనారాయణ, అబ్దుల్‌హనీఫ్, రెహమాన్, కూరపాటి శ్రీను, దాచేపల్లి రాము తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds
RECRUITMENT
★Pen, Pencil Company, Educated, Unemployed Girls/Boys, Male/Female, House Wife Earn 24500-64500 Packing Work at Home 9034548725, 9728230253
NT-3277
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

కల్వర్టులోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

కల్వర్టు పక్కన కల్వర్టులోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

ఆసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఆర్టీసీ భద్రాచలం డీఎం రామారావు

ముగ్గురికి తీవ్ర, 20 మందికి స్వల్ప గాయాలు

సారపాక, మే 12: బస్సు అదుపు తప్పి కాలువలోకి దూసుకెళ్లింది. ప్రయాణికులు తెలిపిన వివరాలు.. ఆర్టీసీ మణుగూరు డిపో పల్లె వెలుగు బస్సు (టీఎస్28 టీఏ 2219) ఆదివారం భద్రాచలం వెళ్తున్నది. సారపాక-మోతేపట్టీనగర్ గ్రామాల మధ్యలోగల ఓ కల్వర్టు వద్దకు రాగానే, ఎదురుగా ఒక్కసారిగా ఆటో అడ్డుగా వచ్చింది. దానిని తప్పించే ప్రయత్నంలో బస్సు అదుపు తప్పి, రోడ్డు పక్కనే ఉన్న కల్వర్టు వంతెన కిందనున్న కాలువలోకి దూసుకెళ్లింది. అందులోని మొత్తం 35 మంది ప్రయాణికుల్లో ముగ్గురికి తీవ్రంగా, 20 మందికి స్వల్పంగా గాయాలయ్యాయి. వారిని బూర్గంపహాడ్ సొసైటీ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, స్థానికు యువకులు కలిసి భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. బస్సు ముందు భాగం దెబ్బతిన్నది. డ్రైవర్ అలీ, కండక్టర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. బస్సు అదుపు తప్పడంతోనే డ్రైవర్ సమయ స్ఫూర్తితో వ్యవహరించడంతో పెను ముప్పు తప్పింది. క్షతగాత్రుల్లో ఎవరికీ ప్రాణాపాయం లేదని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ తెలిపారు. క్షతగాత్రులను భద్రాచలం డిపో మేనేజర్ రామారావు పరామర్శించారు.

రూ.99.94 లక్షలు స్వాధీనం

కూసుమంచిలో ఇన్నోవా పల్టీ కొట్టిన ఘటనలో లభ్యం

కూసుమంచి, మే 12: ఎన్నికల వేళ సరైన పత్రాలు లేకుండా రవాణా చేస్తున్న రూ.99.94 లక్షలను పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటన ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలో ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. హైవే మీదుగా కాకుండా సూర్యాపేట నుంచి నాయకన్‌గూడెం మీదుగా ఖమ్మం వస్తున్న ఇన్నోవా వాహనాన్ని నాయకన్‌గూడెం వద్ద పోలీసులు ఆపారు. దీంతో ఆ వాహనం ఆగకుండా వెళ్లడంతో పోలీసులు దానిని వెంబడించారు. దీంతో వారికి దొరకకుండా వేగంగా ఖమ్మం వైపునకు వెళ్తున్న ఆ ఇన్నోవా వాహనం కేశ్వాపురం సమీపంలోని దేవునితండా వద్ద పల్టీ కొట్టింది. దీంతో అందులోని రెండు ఎయిర్ బెలూన్లు తెరుచుకోవడంతో ఆ వాహనంలోని వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. వెనుకనే వచ్చిన పోలీసులు.. పల్టీ కొట్టిన ఆ వాహనంలో చిక్కుకుపోయిన వ్యక్తిని బయటకు తీశారు. అతడు గాయపడి ఉండడంతో ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. అతడి మిత్రుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. కాగా, ఆ వాహనంలో రెండు బ్యాగుల్లో ఉన్న రూ.500 కట్టలను ఐటీ అధికారుల సమక్షంలో లెక్కించి రూ.99.94 లక్షలుగా నిర్ధారించారు. కూసుమంచి సీఐ జనార్దన్, ఎస్సై కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీలు చేశారు. కాగా, ఎన్నికల వేళ అనుమతి లేకుండా అక్రమంగా తరలిస్తున్న ఈ నగదును స్వాధీనం చేసుకున్నామని, దానిని తరలిస్తూ గాయపడిన వ్యక్తిని గుర్తించామని, పూర్తిస్థాయి విచారణ తరువాత ఆ నగదు ఎవరిదనే విషయాన్ని వెల్లడిస్తామని తెలిపారు.

చెట్టును ఢీకొట్టిన ట్రాక్టర్..

చింతకాని, మే 12: ట్రాక్టర్ చెట్టుకు ఢీకొట్టగా డ్రైవర్‌కు గాయాలైన ఘటన మండలంలో ఆదివారం చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని తిరుమలాపురం గ్రామానికి చెందిన గోపాల్‌కృష్ణ వ్యవసాయ పనుల నిమిత్తం ట్రాక్టర్‌తో పొలానికి వెళ్లాడు. మధ్యాహ్నం పనులు ముగించుకుని తిరిగి వస్తుండగా తిరుమలాపురం క్రాస్‌రోడ్డు వద్ద ట్రాక్టర్ అదుపుతప్పి రోడ్డు పక్కన చెట్టుకు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ గోపాల్‌కు గాయాలు కాగా స్థానికులు 108 వాహనంలో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఆదివాసీల ఆరాధ్యదైవం గంగులు

దమ్మపేట, మే 12: మన్యం వీరుడు సోయం గంగులు ఆదివాసీల ఆరాధ్య దైవమని మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు అన్నారు. సోయం గంగులు వర్ధంతి సందర్భంగా ఆదివారం దమ్మపేట గంగులు విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616